పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 117 టేబుళ్లు
- ఫలితాల వెల్లడికి బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ఎల్ ఈడీలు
- ఖమ్మం రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ వీపీ గౌతమ్
- కౌంటింగ్ కేంద్రానికి మూడంచెల భద్రత: సీపీ

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం రూరల్, మే 2: ఖమ్మం పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాటు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ ఆఫీసర్/కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రమైన మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి మాట్లాడారు. ఈ నెల 4న ఉదయం 8.00 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ (ఖమ్మం, వైరా, మధిర, పాలేరు. సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం) నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపునకు ఏడు ప్రత్యేక గదులను కేటాయించినట్లు, 117 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏడు నియోజకవర్గాల్లోని పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కూడా ఒకేసారి ప్రారంభమవుతుందన్నారు. సర్వీస్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 16.31 లక్షల మంది ఓటర్లకుగాను 12.41 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు చెప్పారు. ఖమ్మం నియోజకవర్గంలో ఎక్కువమంది ఓట్లు ఉన్నందున 18 రౌండ్లలో లెక్కింపు ఉంటుందని చెప్పారు. తక్కువ ఓట్లు ఉన్న అశ్వారావుపేట నియోజకవర్గంలో 13 రౌండ్లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ఫలితాలను ఎప్పటికప్పుడు రౌండ్లవారీగా వెల్లడించేందుకు ఖమ్మం నగరంలోని కొత్త, పాత బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌తోపాటు మధిర, సత్తుపల్లి బస్ స్టేషన్లలో ఎల్‌ఈడీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియలో అధికారులు, సిబ్బంది కలిపి మొత్తం 1500 మంది విధుల్లో పాల్గొంటారని తెలిపారు. కౌంటింగ్ రోజున ఉదయం 5.00 గంటల నుంచి అధికారులు, ఉద్యోగులు విధుల్లో ఉంటారని చెప్పారు. పోలింగ్ ఏజెంట్లు ఉదయం 6.00 గంటల వరకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపును పరిశీలకులు, కేంద్రం నుంచి వచ్చిన సూక్ష్మ పరిశీలకులు పర్యవేక్షిస్తారని చెప్పారు.

మూడంచెల భద్రత : సీపీ

ఓట్ల లెక్కింపు కేంద్రానికి మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు, మీడియా ప్రతినిధులకు ఎన్నికల కమిషన్ జారీ చేసిన పాసులు తప్పనిసరిగా ఉండాలన్నారు. కౌంటింగ్ హాల్‌లోకి మొబైల్ ఫోన్లు, లిక్విడ్ వంటి పదార్థాలు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని చెప్పారు. కౌంటింగ్ కేంద్రం వెలుపల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో కేంద్ర బలగాలను మొహరిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఎలాంటి ర్యాలీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు-ఫలితాల వెల్లడి ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

'హస్తం' నేత 'అధికార' దాహం

- అశ్వారావుపేటలో ఆ పార్టీ మండలాధ్యక్షుడి తీరు చర్చనీయాంశం
- ఎమ్మెల్యే అధికారిక క్యాంపు కార్యాలయంలో పతాక ఆవిష్కరణ
- మండి పడుతున్న సొంత పార్టీ నాయకులు, విపక్షాల నేతలు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు, పాల్గొన్న నాయకులు

అశ్వారావుపేట, జూన్ 2: హస్తం పార్టీ నేతల 'అధికార' అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతుందో లేదో 'అధికారిక' అంశాలను కూడా హస్తగతం చేసుకుంటున్నారు. భద్రాద్రి జిలా అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వ్యవహరించిన తీరు.. తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ వ్యవహారం అటు సొంత పార్టీ నాయకులతోపాటు ఇటు విపక్ష నేతలను కూడా విస్మయానికి గురి చేసింది. వివరాల్లోకి వెళ్తే.. సాక్షాత్తూ స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారిక నివాసమైన శాసనసభ్యుడి క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఏకంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు.

మండిపడుతున్న నాయకులు..

అయితే, ఈ వ్యవహారంపై సొంత పార్టీ నాయకులతోపాటు విపక్షాల నేతలు కూడా మండిపడుతున్నారు. ప్రతీ ఒక్క ఎమ్మెల్యే అతడి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలు కూడా వచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకు చెప్పుకునేందుకు ఒక అధికార వేదిక ఉండాలనే ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతి నియోజకర్గంలోనూ ఒక అధికారిక క్యాంపు కార్యాలయాన్ని నిర్మించింది. అయితే, ఇటీవల కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన జారే ఆదినారాయణ ఆ తరువాత కొద్ది రోజుల్లోనే ఆ క్యాంపు కార్యాలయంలో గృహప్రవేశం చేశారు. కానీ అధికారికంగా నివాసం ఉండడం లేదు. దీంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దీనిని తమ విడిది కేంద్రంగా మార్చుకున్నారనే అభిప్రాయ స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ఆదివారం ఆ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు ప్రభుత్వ అధికారిక కార్యక్రమమైన ఆవిర్భావ వేడుకలను నిర్వహించడంతోపాటు స్వయంగా అతడే జాతీయ జెండాను ఎగురవేయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. దీంతో తుమ్మా రాంబాబుతోపాటు ఆ వేడుకల్లో పాల్గొన్న ఇతర కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేశ్, అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీ వేముల భారతి, మిండా హరి, నాయకులు రేమళ్ల కేదర్‌నాథ్, నంద్రు రమేశ్, రాములు, కానూరి మోహన్ రావు, కోసూరి అప్పలరాజు తదితరులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలి..

సాక్షాత్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన అధికారిక కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు ఏ హోదాలో నిర్వహిస్తారు? ఈ అంశాన్ని మా బీఆర్ఎస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం. కాంగ్రెస్ నాయకుల అధికార దాహానికి, అధికార దుర్వినియోగానికి ఈ అంశమే నిదర్శనం. అధికారిక కార్యక్రమంలో పతాక ఆవిష్కరణ చేసిన కాంగ్రెస్ నేతలపై ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోంది.

-జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీపీ, అశ్వారావుపేట

కొన్నదే తక్కువ.. అందులోనూ కొర్రీలు

- ధాన్యం వద్దంటున్న రైస్ మిల్లు యజమాన్యం
- పట్టించుకోని అధికారులు
- మిల్లు దగ్గరే ఉన్న రైతు ధాన్యం


కొనుగోలు కేంద్రం నుంచి వచ్చిన ధాన్యం రసీదు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 2 (నమస్తేతెలంగాణ): తడిసిన ధాన్యం కొంటాము.. ముక్కిన వడ్లు తీసుకుంటాం.. అన్న సర్కారు మాటలు నీటి మూటలేనా అని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.. రైతుల నుంచి వడ్లు కొన్నదే తక్కువ.. అయినప్పటికీ మిల్లు యజమానులు సవాలక్ష కొర్రిలు పెడుతున్నారని ఓ రైతు ఆవేదన సుజాతనగర్‌లో జరిగింది. లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన రైతు మేరెడ్డి జనార్దన్‌రెడ్డి మూడు రోజుల క్రితం హేమచంద్రాపురం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్లను విక్రయించారు. అక్కడ ఉద్యోగులు వడ్లు తేమ శాతం చూసి కాంటా వేసి సుజాతనగర్ మిల్లుకు పంపారు. మిల్లు యజమాని ధాన్యాన్ని మాకొద్దు.. అని రిజెక్టు చేశారు. దీంతో రైతు ఆవేదన చెందుతూ.. ధాన్యం కొనే ముందే చెప్పకుండా.. మిల్లుకు వచ్చాక ఇప్పుడు వడ్లు బాగాలేదని సాకులు చెబుతున్నారని అధికారులతో వాగ్వాదానికి దిగాడు. రైస్ మిల్లు యజమాని ససేమిరా అనడంతో ధాన్యం మిల్లు వద్దే ఉండిపోయాయి.

కొన్నదే తక్కువ మళ్లీ కొర్రిలు..

యాసంగిలో 13 వేల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశామని పౌరసరఫరాలశాఖ అధికారిక లెక్కలు చెప్పి చివరికి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రిజెక్టు చేయడంలో అర్థం ఏమిటో తెలియడం లేదు. అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం వల్లనే రైతు నష్టపోయే పరిస్థితి వచ్చిందని, ఉన్నతాధికారులు స్పందించి రైతుకు న్యాయం చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై సొసైటీ సెక్రెటరీ సారయ్యను వివరణ కోరగా.. ధాన్యం చివరి నిమిషంలో వచ్చింది. ఏఈవో తనిఖీ చేసి టోకెన్ ఇచ్చారు. మిల్లు దగ్గరకు వచ్చాక ధాన్యం అంతా నూక అవుతుందని మిల్లు యజమాని వద్దంటున్నారు. ఇందులో మా తప్పేమీ లేదు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాము అని చెప్పారు.

వడ్లు తీసుకోక పోతే ధర్నా చేస్తా : మేరెడ్డి జనార్దన్‌రెడ్డి

ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేస్తామని మాట ఇచ్చింది. నా వడ్లు ఎందుకు కొన్నాక మిల్లు యజమాని ఎందుకు తీసుకోవడం లేదు. రేపటి కల్లా నా ధాన్యం తీసుకోకపోతే సొసైటీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తాను. అధికారులే సమాధానం చెప్పాలి.

వైద్యుడు అపహరణ కలకలం!

ఒడిశాలో మావోయిస్టులే కిడ్నాప్ చేశారా?

అపహరణకు గురైన వైద్యుడు అమ్లాన్ కుమార్ బోయి (ఫైల్)

కొత్తగూడెం క్రైం, జూన్ 2: ఒడిశా రాష్ట్రంలో వైద్యుడి అపహరణ సంచలనం సృష్టిస్తోంది. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లాలోని కలిమెల కమ్యూనిటీ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యుడు బోయి అమ్లన్ కుమార్‌ని దుండగులు అపహరించుకు వెళ్లారు. దండగులు అమ్లన్ నివాసముంటున్న కలిమెల క్వార్టర్స్ నుంచి కిడ్నాప్ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘాతుకానికి పాల్పడింది మావోయిస్టులేనని పోలీసులు భావిస్తున్నారు. మావోయిస్టులు తమ సహచరులకు వైద్య సదుపాయాలు అందించడం కోసం అమ్లన్‌ను అపహరించుకెళ్లినట్లు పోలీసులు వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇరవై ఏళ్ల క్రితం డాక్టర్ రాజేంద్ర త్రిపాఠిని సైతం మావోయిస్టులు కిడ్నాప్ చేశారని, ఇప్పటి వరకు ఆయన జాడ తెలియలేదని వార్తలు సైతం వినిపించాయి. ప్రస్తుతం కిడ్నాపైన వైద్యుడు అమ్లన్ కుమార్ కలిమెల కమ్యూనిటీ సెంటర్‌లో హౌజ్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందుకు సంబంధించిన పూర్వపరాలు తెలియాల్సి ఉంది.

నిప్పుల నేలపై పచ్చని పందిళ్లు

ఆరు కోట్ల మొక్కలు నాటిన సింగరేణి సంస్థ

సీఎండీ బలరాం.. హరితయజ్ఞ ఫలితం

ఈ యేడు మరో కార్యక్రమానికి శ్రీకారం

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంతటా ఉష్ణోగ్రతలు ఒకలా ఉంటే .. సింగరేణిలో మాత్రం మండే ఎండలు మరో ఎత్తు. ఈ ప్రాంతంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అటు కాలుష్యం, ఇటు తీవ్ర ఎండలతో సింగరేణిలో పరిస్థితి భయానకంగా ఉంటుంది. అయినా ఇక్కడివాళ్లు ఎంతో కొంత ఉపశమనం పొందుతున్నారంటే సింగరేణి సంస్థ పెంచిన పచ్చని పందిళ్లే కారణం. ఇప్పటి వరకు సింగరేణి సంస్థ 6 కోట్ల మొక్కలు నాటారు. పర్యావరణ ప్రేమికుడు, సీఎండీ బలరాం కృషితో నిప్పుల నేలపై పచ్చని పందిళ్లు పరుచుకున్నాయి. నల్లనేలన హరిత యజ్ఞాన్ని కొనసాగిస్తున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, 2024 - 25లో 'ప్రతి అడుగు పచ్చదనం' నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు.

మండే మట్టికి చల్లదనం

భగభగ మండే మట్టిపై పచ్చదనాన్ని పెంచి చల్లదనాన్ని పంచాలన్నదే బలరాం అభిమతం. ఇందుకోసం సింగరేణి ఏరియాల్లో మొక్కలు నాటే మహాయజ్ఞాన్ని ఐదేండ్లుగా కొనసాగిస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా తానొక్కడే 18 వేల మొక్కలు నాటి పచ్చదనం ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా..

మహబూబ్‌నగర్ జిల్లాలో కడుపేద గిరిజన కుటుంబంలో జన్మించిన బలరాంకు సంక్షేమ హాస్టల్లో చదువుతున్నప్పటి నుంచే మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై ఆసక్తి. సింగరేణి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. 2019లో ప్రపంచ పర్యావరణ దినోత్సవమైన జూన్ 5న కొత్తగూడెంలోని బంగ్లాస్ ఏరియాలో 108 మొక్కలు నాటి వృక్ష మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టారు. శ్రీరాంపూర్ ఉపరితల గని మట్టికుప్పపై 2019 జూలై 20న గంటల వ్యవధిలోనే 1,237 మొక్కలు నాటి అందర్నీ ఆశ్చర్యచకితులను చేశారు. అదేరోజు జైపూర్ ఎన్టీపీసీలో 501 మొక్కలు, ఇలా ఒకే రోజు 1,700కు పైగా మొక్కలు నాటారు. 2021 జూలై 24న రామగుండంలో 12వేల మొక్కలు నాటగా, 2022 ఫిబ్రవరిలో కొత్తగూడెం బంగ్లాస్ 205 గులాబీ మొక్కలను (రోజ్‌గార్డెన్) మియావాకి పద్ధతిలో నాటారు. నాటిన మొక్కలకు జియోట్యాగింగ్ కూడా చేశారు. బలరాం సేవలకు పలు అవార్డులు దాసోహమయ్యాయి.

యాబడి

మీ వాహనానికి థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ ఉందా?



దేశంలో వాహనదారులకు మోటార్ బీమా తప్పనిసరి. మీకు కారున్నా.. బైకున్నా.. లేదా మరే వాహనం ఉన్నా.. వెహికిల్ ఇన్సూరెన్స్ నుంచి మాత్రం తప్పించుకోలేరు. ఇది మోటార్ వెహికిల్స్ యాక్ట్ 1988 నిబంధన. కాబట్టి ప్రతీ వాహనదారునికి మోటార్ ఇన్సూరెన్స్‌పై అవగాహన ఉండాల్సిందే. అయితే చాలామంది మొక్కుబడిగా ఏదో ఓ ఇన్సూరెన్స్‌ను తీసుకుని సరిపెట్టుకుంటున్నారు. ట్రాఫిక్ చలాన్ల నుంచి బయటపడితే చాలన్నట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్‌ను తీసుకునేందుకు పెద్దగా ఎవరూ ఆసక్తి కనబర్చడం లేదు. ఈ రకమైన వైఖరి చాలాచాలా నష్టపరుస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సమగ్ర పాలసీ అవసరం

కార్ ఇన్సూరెన్సైనా, బైక్ ఇన్సూరెన్సైనా సమగ్ర రీతిలో ఉండాలి. మీరు తీసుకున్న వెహికిల్ ఇన్సూరెన్స్ మీ వాహనానికి ఓ భద్రతా వలయంలా రక్షణనివ్వాలి. కేవలం థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్‌పైనే దృష్టి పెట్టకూడదు. ఉదాహరణకు ఒకవేళ మీ ఇంటి బయట పార్క్ చేసిన కారుపై దగ్గర్లోని ఓ చెట్టు కొమ్మ విరిగి పడింది. దీనివల్ల కారుకు బాగానే నష్టం వాటిల్లింది. లేదా ఉదయం లేచిచూసే సరికి మీ అపార్ట్‌మెంట్ అవతలనున్న మీ బైక్‌ను దొంగిలించారు. ఇలాంటి సందర్భాల్లో మీరు తీసుకునే బీమానే మీకు రక్ష. అలాగే వరదలు, భూకంపాల వంటి ప్రకృతి విపత్తులు, అల్లర్ల వంటి వాటిలో నష్టం జరిగినా వాహన బీమా వర్తిస్తుందన్నది మరువద్దు. కాబట్టి అన్ని కోణాల్లో ఆలోచించి, ఆరా తీసి ఓ సమగ్ర పాలసీని తీసుకోవాలి.



పాలసీ కొనుగోలులో ఈ పొరబాట్లు వద్దు

- మీ ప్రాధాన్యతలను గుర్తించకపోవడం
- అసంపూర్ణ కవరేజీతో కూడిన పాలసీలు
- యాడ్-ఆన్ కవరేజీని నిర్లక్ష్యం చేయడం
- వివిధ పాలసీలు, వాటి ప్రీమియంలను పరిశీలించకపోవడం
- నో క్లెయిమ్ బోనస్‌లను పట్టించుకోకపోవడం

థర్డ్-పార్టీ బీమా అంటే?

కార్ ఇన్సూరెన్స్, బైక్ ఇన్సూరెన్స్‌లో థర్డ్-పార్టీ బీమా చాలా ముఖ్యమైనది. మోటార్ ఇన్సూరెన్స్‌లో ఫస్ట్-పార్టీ వాహన యాజమాని (ఇన్సూరెన్స్‌ను కొన్నవారు). సెకండ్-పార్టీ ఇన్సూరెన్స్‌ను అమ్మినవారు (బీమా సంస్థ). థర్డ్-పార్టీ ఏదైనా ప్రమాదంలో మీ వాహనం వల్ల నష్టపోయినవారు, గాయాలపాలైనవారు, చనిపోయినవారు. చికిత్సకు వైద్య ఖర్చులు, ఆస్తి నష్టానికి నగదును ఈ కవరేజీలో బీమా సంస్థనే అందిస్తుంది. థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే ఈ ఖర్చులన్నీ వాహనదారుడి నెత్తిపైనే పడుతాయి. కనుక తప్పకుండా అత్యుత్తమ బీమాను తీసుకోవాలి. గడువు దాటకముందే రెన్యువల్స్ చేస్తూపోవాలి. అయితే ప్రమాదంలో మీకు (ఇన్సూరెన్స్‌ను కొన్నవారు), మీ వాహనానికి జరిగిన నష్టం మాత్రం థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ పరిధిలోకి రాదు.

ఇది గుర్తుంచుకోండి..

సరైన వాహన బీమా పాలసీని తీసుకోవడం వల్ల మీ కారు, బైక్‌లకే కాదు.. మీకూ అనేక లాభాలుంటాయి. కాబట్టి మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల మోటార్ ఇన్సూరెన్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించి ఓ నిర్ణయానికి రావాలి. ఈ క్రమంలో క్యాష్‌లెస్ గ్యారేజ్ నెట్‌వర్క్స్, ప్రీమియం ధరలు, యాడ్-ఆన్ ఫీచర్లు, బీమా సంస్థకున్న విశ్వసనీయత, కవరేజీ వంటి వాటిని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలి. కాగా, మెకానికల్ లేదా ఎలక్ట్రికల్ బ్రేక్‌డౌన్ జరగడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనం నడిపి ప్రమాదాలకు గురికావడం, మద్యం సేవించి వాహనాలు నడుపడం వంటి నిబంధనల ఉల్లంఘనల్లో కవరేజీలు వర్తించవు.

దీర్ఘకాలిక పెట్టుబడులే మేలు

స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌పై నిపుణుల సలహా

దేశీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే మదుపరులు.. దీర్ఘకాలిక పెట్టుబడులపై దృష్టి సారించాలని మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. ఇటీవలే మునుపెన్నడూ లేనివిధంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 76,000 మార్కును, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 23,100 స్థాయిని తాకిన విషయం తెలిసిందే. దీంతో ఈ ర్యాలీ వెనుక ఆకర్షణీయమైన కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు, బలమైన ఆర్థికాంశాలున్నాయని ఎక్స్‌పర్ట్స్ విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలోనే రిటైల్ ఇన్వెస్టర్లు.. క్వాలిటీ స్టాక్స్‌ను కొనేందుకున్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా సలహా ఇస్తున్నారు. కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్లు ఐదేండ్ల క్రితంతో పోల్చితే క్లీన్‌గా ఉన్నాయని, విస్తరణకు వీలు కూడా ఉందంటున్న విశ్లేషకులు.. ఈ కంపెనీల షేర్లలో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని కూడా చెప్తున్నారు. కాగా, ఎన్నికలు, ఫలితాల దృష్ట్యా కొద్ది రోజుల వరకు మార్కెట్లలో ఒడిదొడుకులు తప్పవని కూడా పేర్కొంటున్నారు.

ఈ రంగాల్లో..

ఆటోమోటివ్, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కన్స్యూమర్ డిస్క్రీషియనరీ షేర్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్స్, ఎఫ్ఎంసీజీ, ఐటీ, కెమిక్సల్ రంగాల షేర్లలోనూ పెట్టుబడులకు వీలున్నది. కాబట్టి ఇన్వెస్టర్లు తమ ఆర్థిక లక్ష్యాలకు, అందుబాటులో ఉన్న నగదు నిల్వలకు, రిస్క్‌ను భరించే స్థాయికి అనుగుణంగా పెట్టుబడులకు వెళ్లవచ్చు. నిజానికి ఈ ఏడాదిలో ఇప్పటిదాకా బీఎస్ఈ సెన్సెక్స్ 4 శాతం వరకు పుంజుకున్నది. భారతీయ ఈక్విటీల్లో నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నా సూచీలు రికార్డు గరిష్ఠాలకు చేరడం కలిసొచ్చే అంశమేనని చెప్పవచ్చు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా ఎఫ్‌పీఐలు దాదాపు రూ.21,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు మరి.

కంపెనీలు తమ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తున్నాయి. చాలా సంస్థలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక పెట్టుబడులకే వెళ్లాలి. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ను పరిశీలించవచ్చు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని లాభాలను ఆర్జించవచ్చు.


-తేజస్ ఖోడే, ఫీర్స్ వ్యవస్థాపక సీఈవో

స్టాక్ మార్కెట్లు పెరగడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయి. కనుక ఇది నిలకడైన ర్యాలీగానే చెప్పుకోవచ్చు. మున్ముందు సూచీలు మరింతగా పెరిగే వీలుందనే అనుకుంటున్నా. కాబట్టి దీర్ఘకాలిక పెట్టుబడులకు అనువుగానే భావించవచ్చు. ఇక ఈక్విటీల్లో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం తక్కువగా ఉన్నది. ఇంకా పెరగాలి.

-ఉపాసన భరద్వాజ్, కొటక్ మహీంద్రా బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త

పోర్ట్‌ఫోలియోల్లో వైవిధ్యం, బలమైన మూలాలున్న క్వాలిటీ స్టాక్స్‌లో పెట్టుబడులు, ఊహాజనిత ట్రేడింగ్‌కు దూరంగా ఉండటం వల్ల స్టాక్ మార్కెట్ రిస్క్‌లను మదుపరులు అధిగమించవచ్చు. ముఖ్యంగా స్వల్పకాలిక పెట్టుబడులకు వెళ్లకుండా కనీసం 2-3 ఏండ్లైనా దీర్ఘకాలిక పెట్టుబడులకు వెళ్లాలి.

-వినాయక్ మెహెతా, ఇన్ఫినిటీ గ్రూప్ వ్యవస్థాపక డైరెక్టర్

నెలకు 2 లక్షల పెన్షన్ కావాలా?

ఎన్‌పీఎస్ రిటైర్మెంట్ ప్లాన్ తెలుసుకోండిలా..

ప్రస్తుతం మీ వయసు 30 ఏండ్లైతే.. మీ పదవీ విరమణ అనంతరం నెలకు రూ.2 లక్షల పెన్షన్ కోసం రూ.5 కోట్ల కార్పస్ ఫండ్ అవసరం.

ఇందుకు నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) అనువైనదిగా చెప్పవచ్చు. ఎన్‌పీఎస్ అనేది స్టాక్ మార్కెట్ లింక్డ్ స్కీమ్. ఇందులో పెట్టిన పెట్టుబడుల సగటు వార్షిక వృద్ధి ఏటా 10 శాతంగా ఉంటున్నది. అందుకే మెరుగైన మీ పెన్షన్ అవసరాలకు ఎన్‌పీఎస్ సరైనదని ఆర్థిక నిపుణులు సైతం అంటున్నారు.

నెలకు రూ.22,150

నెలనెలా దాదాపు రూ.22,150ని పెట్టుబడిగా పెడితే 30 ఏండ్లలో మీ పెట్టుబడులు రూ.5 కోట్లకు చేరుతాయి. చక్రవృద్ధి ప్రయోజనం ఇదే మరి. 30 ఏండ్లలో మీ పెట్టుబడులు రూ.79.74 లక్షలు. దీనిపై ఏటా 10 శాతం వృద్ధితో మరో రూ.4.21 కోట్లు సమకూరుతాయి. దీంతో కార్పస్ ఫండ్ రూ.5 కోట్లుగా ఉంటుంది. అప్పుడు నెలనెలా మీ రిటైర్మెంట్ వయసులో రూ.2 లక్షల పెన్షన్‌ను అందుకోవచ్చని పర్సనల్ ఫైనాన్స్ ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

ఇదీ సంగతి..

మీరు రిటైరైనప్పుడు మీకు రెండు మార్గాలుంటాయి. అవి ఓ యాన్యుటీ ప్లాన్‌లో మీ మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెట్టి పెన్షన్ తీసుకోవడమో లేదా రిటైరైన తర్వాత వచ్చిన ఆ సొమ్ములో 60 శాతం ఉంచుకుని, మిగతా 40 శాతంతో యాన్యుటీ ప్లాన్‌లో చేరడమో అవుతుంది. అయితే ప్రస్తుత ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) రేట్లను గమనిస్తే.. ఇంకా 6-7 శాతంగానే ఉన్నాయి. ఎఫ్‌డీల్లో నగదును పెట్టడం సురక్షితమే అయినా.. ఆశించిన లేదా ఆకర్షణీయ రాబడులు రావు. దీనికన్నా ఎన్‌పీఎస్‌లో పెట్టుబడులతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. అయితే ఎన్‌పీఎస్.. మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటుంది. అయినప్పటికీ దీర్ఘకాలంలో మెరుగైన రాబడులనే అందిస్తుందన్న నమ్మకం పెట్టుకోవచ్చు. కానీ పెట్టుబడులకు దిగే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకుంటే మరింత ధీమాగా ఉండవచ్చు.



**మార్క